# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 27, జులై 2026


## బాసర అమ్మవారి సన్నిధిలో లేబర్ కమిషనర్ పూజలు

### కుటుంబ సమేతంగా దర్శించుకున్న పమేలా సత్పతి

**భైంసా, జులై 26, ప్రభాతవార్త:**

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి బాలలయంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ కమిషనర్ పమేలా సత్పతి ఆదివారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న కమిషనర్‌కు ఆలయ ఈఓ అంజనీదేవి, అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి బాలలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని లేబర్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ శ్రావణి, ఆలయ ఏఈఓ గంగా సింగ్, కార్మిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్లపై పశువుల మకాం

### ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రధాన మార్గం

**మంచిర్యాల ప్రతినిధి, జూలై 26, ప్రభాతవార్త**

బొక్కలగుట్ట దగ్గర గల జాతీయ రహదారి 363 లోని గాంధారి మైసమ్మ ఆలయం సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై పశువులు నిత్యం పడుకోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రద్దీగా ఉండే ఈ మార్గంలో పశువులు రహదారిని ఆక్రమించడంతో వాహనదారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం మీదుగా ప్రతిరోజు కార్లు, లారీలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు, పాదచారులు కూడా భయాందోళనల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రత్యేకించి రాత్రి వేళల్లో రహదారిపై పడుకున్న పశువులు కనిపించకపోవడంతో వాహనదారులు ఒక్కసారిగా బ్రేకులు వేయాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగా పలుమార్లు ప్రమాదాలు తృటిలో తప్పిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం ఇదే ప్రాంతంలో గతంలో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు సంభవించి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో సంబంధిత శాఖలు విఫలమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించేందుకు పశువులు రహదారిపైకి రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పశువుల యజమానులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడంతో పాటు రహదారిని నిరంతరం పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ, సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. మరో ప్రాణనష్టం జరగక ముందే అధికారులు స్పందించి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.గాంధారి మైసమ్మ ఆలయం వంటి భక్తులు అధికంగా సందర్శించే ప్రాంతంలో ఇలాంటి పరిస్థితులు కొనసాగడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా తక్షణ చర్యలు చేపట్టి రహదారిని పశువుల రహితంగా మార్చాలని స్థానికులు, భక్తులు, వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## నాలుగు లేబర్ కోడ్ల రద్దుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

**ఆసిఫాబాద్, జులై 26, ప్రభాతవార్త :**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలు చేపడతామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ హెచ్చరించారు. ఆదివారం ఆసిఫాబాద్ పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఏఐటీయూసీ జిల్లా 4వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా బస్ స్టాండ్ నుంచి మైనార్టీ ఫంక్షన్ హాల్ వరకు కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్ అధ్యక్షతన మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలని, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేల అమలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగ హోదా, మున్సిపల్, మిషన్ భగీరథ, సింగరేణి, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు వివిధ కార్మిక వర్గాల డిమాండ్లను నెరవేర్చాలని మిగతా 2లో..

## 30 దూడల స్వాధీనం..

### ఐదుగురిపై కేసు నమోదు

**చింతలమానేపల్లి, జూలై 26, ప్రభాతవార్త;**

మండలంలోని దిందా గ్రామం శివారు ప్రాణహిత నది ఒడ్డున ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా కట్టివేసిన 30 దూడలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశువుల అక్రమ రవాణా సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించి వీటిని పట్టుకున్నారు.పట్టుబడిన వాటిలో 12 ఆడ, 18 మగ దూడలు ఉన్నట్లు ఎస్సై ఎం. కమలాకర్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి పశువులను దొంగిలించి, రాత్రివేళల్లో తెలంగాణలోని వధశాలలకు తరలించి విక్రయిస్తున్నట్లు నిందితుడు ఇప్ప శ్రీకాంత్ విచారణలో అంగీకరించాడు. ఈ దందాలో సహకరిస్తున్న వాంకిడీకి చెందిన ఖలీద్, ముక్తియార్, మన్సూర్, మొయిన్‌లతో పాటు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. అక్రమంగా పశువులను తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు.కఠిన చర్యలు తప్పవనీ ఎస్సై అన్నారు.

# కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నియామకం విషయంలో పునరాలోచన చేయాలి

● మాజీ జెడ్పీటీసీ ఆత్రం లక్ష్మణ్ రావు

**కెరమెరి జులై 26 ప్రభాతవార్త:**

కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి నియామకాన్ని పునరాలోచించాలని మాజీ జెడ్పీటీసీ, మోడి గ్రామ సర్పంచ్ ఆత్రం లక్ష్మణ్ రావు డిమాండ్ చేశారు.ఇటీవల కెరమెరి మండలానికి నూతన అధ్యక్షుడి నియామకం జరిగిన నేపథ్యంలో, కెరమెరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ జెడ్పీటీసీ ఆత్రం లక్ష్మణ్ రావు అధ్యక్షతన మండలంలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆత్రం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ మూలాలు ఉన్న వ్యక్తిని కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అలాంటి వ్యక్తి నియామకం వల్ల పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో సదరు వ్యక్తి బీఆర్ఎస్ మద్దతుతో వార్డు సభ్యునిగా పోటీ చేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయాడని గుర్తు చేశారు.ఇలాంటి నియామకం వల్ల ప్రతిపక్ష పార్టీలకు విమర్శలు చేసే అవకాశం కల్పించినట్టయిందని, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఈ నియామకం జరిగిందని ఆరోపించారు. దీంతో పార్టీ కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారని అన్నారు.అందువల్ల కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వెంటనే జోక్యం చేసుకుని, ఈ నియామకాన్ని పునఃసమీక్షించి, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా కొత్త నియామకాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుసుమ రావు, ఎల్లాప రజాక్, సర్పంచులు కుమ్రం భీమ్, నాజేశ్వర్, ఆనందరావు, మారుతి రాథోడ్, చక్కటి శ్రీనివాస్, సీతారాం, ఉప సర్పంచులు రాందాస్, దత్తు, ఆనందరావు, డీసీసీ కార్యదర్శి కోట్రంగే తిరుపతి, మొహర్లె నాగేష్, రాథోడ్ బాబు నాయక్, ఆత్రం రాజు, మాధవి రాజు, హనుమంతు, గుండి బాబురావు, సమద్, తలీం ఖాన్, ఫయాజ్, మాజీ సర్పంచులు పి. జలపతి రావు, లింబారావు బుచ్చన్న తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మన భైంసా గర్వం.. తెలంగాణ గర్వం

**- డాక్టర్ అనిల్ కుమార్‌కు ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు 2026 ప్రదానం**

**భైంసా, జులై 25, ప్రభాతవార్త:**

భైంసా పట్టణానికి చెందిన జీడీఆర్ కృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ అనిల్ కుమార్ రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకని పట్టణ కీర్తిని సమున్నతంగా నిలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ హెల్త్ కేర్ పాలసీ, ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో ఆయనకు ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు 2026ను బహూకరించారు. పేదలకు ఉచిత వైద్యం అందించడం, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వేలాది మందికి ప్రాణదానం చేయడం, మానవత్వంతో ఆయన అందిస్తున్న అసమాన సేవలకు గుర్తింపుగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర వైద్య విభాగం ఈ అవార్డుతో సత్కరించింది. భైంసా పేరును రాష్ట్ర స్థాయిలో మారుమోగించిన వైద్యుడు డాక్టర్ అనిల్ కుమార్‌కు స్థానిక నాయకులు, ప్రజలు, సహచర వైద్యులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి: సజన్ కుమార్

**మూగజీవులను విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడాలి - ఆలుగామ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అధికారులకు వినతిపత్రం**

**కోటపల్లి, జూలై 26, ప్రభాతవార్త**

గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద జరుగుతున్న ప్రమాదాలను నివారించి, రైతుల జీవనాధారమైన మూగజీవులను విద్యుత్ షాక్‌ల నుంచి కాపాడేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎంబరి సజన్ కుమార్ విద్యుత్ అధికారులను కోరారు. ఆదివారం ఆలుగామ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సజన్ కుమార్ మాట్లాడుతూ... ఆలుగామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రొయ్యలపల్లి, ఆలుగామ, సిర్స గ్రామాల్లో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై పశువులు మృతి చెందడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పశువులే ప్రధాన ఆధారమని, వాటిని కోల్పోవడం వల్ల రైతు కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో విద్యుత్ అధికారులు స్పందించి, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు (ఫెన్సింగ్) ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ తీవ్ర సమస్యను తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి కూడా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. రైతులు, మూగజీవుల రక్షణ కోసం సజన్ కుమార్ తీసుకున్న ఈ చొరవను పలువురు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ దుర్గం బ్రహ్మయ్య, సెక్రటరీ పల్లె సత్తయ్యలతో పాటు పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి భానేష్‌కు ఘన సన్మానం

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 26, ప్రభాతవార్త**

మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన రామగిరి భానేష్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వినర్ నాతరి స్వామి శాలువా కప్పి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా నాతరి స్వామి మాట్లాడుతూ రామగిరి భానేష్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ప్రాంత రైతులకు మేలు చేసే పరిణామమని తెలిపారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని, వారికి సరైన మద్దతు అందించేందుకు ఆయన కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డులో పారదర్శక వ్యవస్థ, సౌకర్యాల మెరుగుదల దిశగా కొత్త చైర్మన్ పనిచేయాలని సూచించారు. అలాగే సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు ఈ బాధ్యతను చేపట్టడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు రామగిరి మహేష్, ఓబిసి కోచైర్మన్ బండి లక్ష్ముణ్, నాయకులు రమాకాంత్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని రామగిరి భానేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# నాలుగు లేబర్ కోడ్ల రద్దుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానించారు. కుమురం భీం జిల్లాలో అన్ని రంగాల్లో ఏఐటీయూసీ ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నుకోబోయే కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు రాజు, మేకల దాస్, లక్ష్మణ్, సీపీఐ సీనియర్ నాయకులు బద్రి సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లానాయకులు దివాకర్, భోగే ఉపేందర్, చిరంజీవి, బాలేష్, రమేష్,జంషడ్, షకీర్,రాజగౌడ్, సంతోషి, పుష్పలత, మమత, సుధాకర్, దత్తు,కాంతక్క, బుజ్జమ్మ, మోగిలి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ చెన్నూరు మండలాధ్యక్షుడిగా ముత్యాల బాపుగౌడ్

**- రెండోసారి అధ్యక్ష పదవి కట్టబెట్టిన పార్టీ పెద్దలు**

**- కష్టకాలంలో పార్టీని బలోపేతం చేసినందుకే ఈ గుర్తింపు**

**- మండలాధ్యక్షుడు ముత్యాల బాపుగౌడ్**

**చెన్నూరు, జూలై 26, ప్రభాతవార్త**



చెన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ముత్యాల బాపుగౌడ్ రెండోసారి పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ శ్రేణులందరిని సమన్వయపరిచి ఒక తాటిపైకి తీసుకువచ్చానని, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ తిరిగి పార్టీ శ్రేణుల సహకారంతో పెద్దెత్తున పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అందుకుగాను పార్టీ నన్ను గుర్తించి మండల కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆశీస్సులతో పార్టీ నాయకుల, కార్యకర్తల సహకారంతో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపి వంశీకృష్ణ ఆదేశాల మేరకు రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టడం జరిగిందన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# హమాలీవాడ నల్ల పోచమ్మ ఆలయంలో ఘనంగా ఆషాఢమాస బోనాల జాతర

**- అమ్మవారిని దర్శించుకున్న మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్**

**మంచిర్యాల బ్యూరో, జూలై 26, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ హమాలీవాడలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఆషాఢమాస బోనాల జాతరను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్‌లతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన మేయర్, డిప్యూటీ మేయర్లు పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ.. జగన్మాత నల్ల పోచమ్మ అమ్మవారి దివ్య కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో మంచిర్యాల పట్టణం అన్ని రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు స్థానిక కార్పొరేటర్ నల్ల శంకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, జోగిని నిషా క్రాంతి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో శంకర్పల్లి

## తాగునీటి లీకేజీలు... వెలగని వీధి దీపాలు...
## ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం, బోర్ వెల్...
## పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న గ్రామ సమస్యలు



**మందమర్రి, మార్చి26, ప్రభాతవార్త**

అభివృద్ధికి నోచుకోవాల్సిన మందమర్రి మండలం శంకర్పల్లి గ్రామం ప్రస్తుతం అనేక మౌలిక సమస్యలతో సతమతమవుతోంది. గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడం, ప్రమాదకరంగా మారిన 11 కేవీ విద్యుత్ స్తంభం, రక్షణ లేకుండా ఉన్న బోరువెల్, లీకేజీలతో వృథా అవుతున్న తాగునీటి సరఫరా పంపులు, రాత్రివేళల్లో వెలగని వీధి దీపాలు గ్రామస్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గ్రామానికి అవసరమైన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణం ప్రారంభమైనప్పటికీ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో గ్రామ పరిపాలనా కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. గాలులు, వర్షాల సమయంలో అది కూలిపోయే ప్రమాదం ఉందని, విద్యుత్ శాఖ వెంటనే స్పందించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా గ్రామంలోని ఒక బోరువెల్ రక్షణ గోడ లేదా మూత లేకుండా ఉండటంతో చిన్నారులు, పశువులు ప్రమాదవశాత్తు అందులో పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాగునీటి సరఫరా పంపులు లీకేజీలతో నీరు వృథా అవుతోంది. దీనివల్ల తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడటమే కాకుండా విలువైన నీరు వృథా అవుతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మరోవైపు గ్రామంలోని వీధి దీపాలు రాత్రివేళల్లో వెలగకపోవడంతో ప్రధాన వీధులు చీకటిమయంగా మారుతున్నాయి. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు మరియు అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శంకర్పల్లి గ్రామంలో నెలకొన్న ఈ సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# మిర్యాలగూడలో యంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సమావేశాలు

## - జయప్రదం చేయాలని పిలుపు

**బెల్లంపల్లి, జూలై 26, ప్రభాతవార్త**

జూలై 28, 29 తేదీలలో నల్గొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహించనున్న యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి సుమారు 70 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ సమావేశాలకు హాజరవుతారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన విద్యార్థి, యువజన ఉద్యమాలపై, అలాగే నీట్ పేపర్ లీకేజీ ఘటన నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు చెప్పారు. విద్యార్థి యువజన పోరాటాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే కేవలం రాజీనామాతో సమస్యలు పరిష్కారం కావని, కేంద్ర విద్యా విధానంపై సమగ్ర సమీక్ష చేయాలని, ముఖ్యంగా నీట్ విధానాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన 21 మంది విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనల సందర్భంగా విద్యార్థులు, యువతపై నమోదైన కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరారు. అలాగే బ్రిటిష్ కాలం నాటి నిర్బంధ చట్టాలను రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, ఈ అంశాలపై రాష్ట్ర కమిటీ సమావేశంలో లోతుగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడానికి ఐక్య కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, తోగరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## కద్గమ్‌లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు
### - తొలి ఏకాదశి సందర్భంగా విఠల రుక్మిణి ఆలయ సందర్శన

**భైంసా, జులై 25, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని కద్గమ్ గ్రామంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ విఠల రుక్మిణి ఆలయంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికి, ఆలయ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ముధోల్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని, రైతులకు సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ భైంసా మండల కోశాధికారిగా భోజరెడ్డి
### ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదేశాల మేరకు నియామకం

**భైంసా, జులై 25, ప్రభాతవార్త:**

భైంసా మండల భారతీయ జనతా పార్టీ నూతన కోశాధికారిగా భోజరెడ్డి నియమితులయ్యారు. పట్టణంలోని ఎస్ఎస్ ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదేశాల మేరకు ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన కోశాధికారి భోజరెడ్డి మాట్లాడుతూ.. తన సేవా నిరతిని గుర్తించి భైంసా మండల కోశాధికారిగా బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలతో సమన్వయంగా పనిచేస్తూ మండలంలో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి, కామోల్ సర్పంచ్ చింత చిన్నయ్య, ఉపసర్పంచ్ రాజ్యం, నాయకులు అసం నవీన్, ధర్మారెడ్డి, బుచ్చన్న, తిక్కుల మధుసూదన్ రెడ్డి, వంగ ధర్మారెడ్డి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాసరలో గ్రామ పండుగకు ముందస్తు ఏర్పాట్లు
### పోచమ్మ ఆలయ ఆవరణను శుభ్రం చేయించిన అధికారులు, నాయకులు

**భైంసా, జులై 26, ప్రభాతవార్త:**

బాసరలో వచ్చే నెల 9వ తేదీన నిర్వహించనున్న గ్రామ పండుగను పురస్కరించుకుని ముందస్తు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ వెంకటేష్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ నూకల లింగారం, గ్రామ పెద్దల ఆదేశాల మేరకు శనివారం పోచమ్మ ఆలయం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని జేసీబీ సాయంతో పూర్తిగా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గ్రామ పండుగ రోజున పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా పరిసరాలను శుభ్రపరుస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఆలయం వెనుక భాగం నుంచి పశువులు వెళ్లే అవకాశం ఉన్నందున, వాటి భద్రత, రక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బకాయిలు తెప్పించకుండా సింగరేణిని ఆర్థికంగా నష్టం చేస్తున్నారు

**- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యటనలు ప్రచారానికే పరిమితం**

**- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నరసింహారావు, తుమ్మల రాజారెడ్డి**

**నస్పూర్, జూలై 26, ప్రభాతవార్త**

కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డి, రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణిలో పర్యటనలు చేస్తున్నారే తప్ప సంస్థకు రావాల్సిన బకాయిలు ఇప్పించే ప్రయత్నాలు చేయకుండా ఆర్థికంగా నష్టం చేస్తున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు, వేజ్ బోర్డు మెంబర్ మంద నరసింహారావు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కొత్త గనులకు అనుమతుల కొరకు ఒత్తిడి తెచ్చి నూతన గనులను సాధించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజా ప్రతినిధులు డిపెండెంట్లకు నియామక పత్రాలు కేవలం మార్చి వరకే ఇవ్వడం వల్ల మిగిలిన వారు తీవ్ర నిరాశతో ఎదురు చూస్తున్నారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వారికి, విజిలెన్స్ ఎంక్వయిరీ పేరిట నిలిపివేసిన డిపెండెంట్లకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కాకుండా యాజమాన్యమే తక్షణమే ఆఫీస్ ఆర్డర్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం సరికాదని, బోర్డు కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా ఇన్వాలిడేషన్ శాతం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్, బ్రాంచ్ కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు నరేడ్ల వెంకట రెడ్డి, పెరుక సదానందంతో పాటు పెద్ద సంఖ్యలో యూనియన్ కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

## పాలకవర్గం అంకితభావంతో పనిచేయాలి: ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు

**- మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహణ**

**- నూతన పాలకవర్గానికి శాలువాలతో ఘన సన్మానం**

**మంచిర్యాల, జూలై 26, ప్రభతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నూతన మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా రామగిరి బానేష్, వైస్ చైర్మన్‌గా జాలే రాయలింగు, డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధరలు పొందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా పనిచేస్తూ మార్కెట్ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.జిల్లా మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ వారి ప్రయోజనాల కోసం నూతన పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, వైస్ చైర్మన్ జాలే రాయలింగు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, కొక్కిరాల సురేఖలను గజమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, మార్కెట్ కమిటీ జిల్లా అధికారులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, రైతు ప్రతినిధులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

బోనాలతో తరలి వెళ్తున్న మహిళలు బోనాల సంబరాలు

## జన్మభూమి నగర్‌లో భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవం

**- డప్పు సప్పుళ్ళు వాయిద్యాలు, శివసత్తుల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణ**

**మంచిర్యాల, జూలై 26, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. కాలనీవాసులు పోచమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ వస్త్రధారణలో మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ భక్తి పారవశ్యంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో కాలనీ అంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. బోనాల ఊరేగింపులో డప్పు వాయిద్యాల మోతలు మార్మోగగా, శివసత్తులు భక్తి పారవశ్యంలో చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పోతురాజులు చేసిన సాంప్రదాయ విన్యాసాలు ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అమ్మవారికి మేకపోతులు, కోళ్లతో మొక్కులు చెల్లించి తమ కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ప్రార్థించారు. ఉత్సవాల్లో మహిళలు, యువత, వృద్ధులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో కిటకిటలాడగా, జై పోచమ్మ తల్లి నినాదాలతో జన్మభూమి నగర్ మార్మోగింది. కార్యక్రమం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది నిర్వహించే బోనాల ఉత్సవాలను ఈసారి మరింత ఘనంగా నిర్వహించినట్లు కాలనీవాసులు తెలిపారు. పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుతూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ బోనాల ఉత్సవం జన్మభూమి నగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహణ

**ఆసిఫాబాద్, జులై 26, ప్రభాతవార్త :**

తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్సీసీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో అమరవీరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి. శారద మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. అనంతరం ఎన్సీసీ కోఆర్డినేటర్ ఎ. నాగరాణి, అధ్యాపకులు కార్గిల్ విజయ్ దివస్ చారిత్రక ప్రాధాన్యాన్ని వివరించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల సేవలను కొనియాడారు. విద్యార్థినులు దేశభక్తి గీతాలు ఆలపించడంతో పాటు కార్గిల్ యుద్ధ వీరుల త్యాగాలను స్మరిస్తూ ప్రసంగాలు చేశారు. దేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్. సంధ్యారాణి, పరిపాలనాధికారి (ఏఓ) సుజాత, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మాదారం శ్రీ ఇంక్లైన్లో భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

**తాండూర్, జూలై 26, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం శ్రీ ఇంక్లైన్ ఎస్టీ కాలనీలో ఆదివారం పోచమ్మ బోనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పు చప్పుళ్ళుతో మహిళలు తలపై బోనాలు పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లారు. పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు.తమ కుటుంబాలను చల్లగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు విరివిగా పండాలని మహిళలు, భక్తులు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

## స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్షకు శత శాతం హాజరు

**ఆసిఫాబాద్, జులై 26, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ), పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లను దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రంలోని కొమురం భీమ్ స్టడీ సర్కిల్‌లో కేవలం ఆదివాసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 106 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హత కలిగిన ఆదివాసీ అభ్యర్థులకు ఈ శిక్షణ అందించనున్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 50 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, వారికి ఆరు నెలల పాటు భోజన వసతితో కూడిన పూర్తిస్థాయి ఉచిత శిక్షణ అందించనున్నట్లు కొమురం భీమ్ స్టడీ సర్కిల్ ఆసిఫాబాద్ పాలక మండలి సభ్యులు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఆదివాసీ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రాయి సిడం రాము, సోయం ఇందు రావు, కొట్నాక్ రఘు, కుడిమేత బాధిరావు, మడవి మాన్కు, గేడం జూగాది రావు, నిర్వాహకులు కాంపెల్లి ఊశన్న, రాజశేఖర్‌తో పాటు పలువురు అధికారులు, అభ్యర్థులు హాజరైయారు.

ఎక్కాహం నిర్వాహకులు శంకర్ దాస్‌ను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

## ముగిసిన ఎక్కాహం....

**ఆసిఫాబాద్ టౌన్, జులై 26, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ సన్నిధిలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఎక్కాహం 24 గంటల అఖండ భజన ఆదివారం ముగిసింది. చెన్నూరుకు చెందిన చిలువేరు శంకర్ దాస్ బృందము ఆధ్వర్యంలో వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ, భక్త బృందం నిర్వహించిన భజన కార్యక్రమంలో పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాలు, మహిళా భక్తులు విశేషంగా పాల్గొని భక్తి పారవశ్యంతో నృత్యాలు చేస్తూ భగవన్ నామస్మరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వజ్జల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కమిటీ ప్రముఖులు పిన్న వివేక్, ఎకరాల శ్రీనివాస్, డాక్టర్ రమేష్, మధు, గడ్డల వెంకన్న, మూర్తి, సుధాకర్, మహిళా భక్తులు ముత్యాల గీత, ఇరుకుల్ల మంగ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. అనంతరం మంగళహారతి, మహా మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరంభక్తులకు అన్నదానం నిర్వహించారు.

## ఆసిఫాబాద్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ఆసిఫాబాద్, జులై 26, ప్రభాతవార్త;**

ఆసిఫాబాద్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆది వారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్ఎం గార్డెన్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటిని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రాందాస్, గద్దల సంతోష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా రవి నాయక్, మల్రాజు రవీందర్, రాజ్‌కుమార్, అధ్యక్షుడిగా మురుమురే రాజు, ప్రధాన కార్యదర్శిగా సదాశివ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అశోక్ గౌడ్, ఆత్రం రాము, మొయినోద్దీన్, కోశాధికారిగా బర్ల వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా ఖలీల్, ఇర్ఫాన్, దొబ్బల శ్రీనివాస్, జాడే అవినాష్, ప్రచార కార్యదర్శిగా వోరగంటి సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను శాలువ కప్పి సన్మానించారు.

## రోడ్డుపై బురద తొలగింపు

**వేమనపల్లి, జులై 26, ప్రభాతవార్త**

ముల్కలపేట గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డుపై పేరుకుపోయిన బురదను ఆదివారం సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ సాయంతో తొలగించారు. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు చేపట్టి రోడ్డును శుభ్రం చేయించారు. గ్రామస్తులు ఈ చర్యను అభినందించారు.

# ఘనంగా గోరింటాకు వేడుకలు

## కాగజ్‌నగర్ కాపువాడలో సంప్రదాయబద్ధంగా అమ్మవారికి పూజలు

**కాగజ్‌నగర్ రూరల్,జూలై 26, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలను మహిళలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గోరింటాకు చెట్టు నుంచి ఆకులను సేకరించారు. వాటితో గోరింటాకు తయారు చేసుకుని వేడుకల్లో పాల్గొన్నారు.మహిళలంతా ఒకే చోట చేరి ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ ఉత్సాహంగా సందడి చేశారు. గోరింటాకు పిండిని చేతులకు, అరచేతులకు పెట్టుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడంతో వేడుకకు మరింత శోభ సంతరించుకుంది. చిన్నారులు సైతం కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తమ సంప్రదాయంలో భాగమని మహిళలు తెలిపారు. స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ ప్రతి ఏడాది ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలంతా కలిసిమెలిసి వేడుకల్లో పాల్గొనడంతో కాపువాడలో సందడి వాతావరణం నెలకొంది.

# మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు

**కాగజ్‌నగర్ రూరల్,జూలై 26, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి వీక్షించారు. ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ఆసక్తిగా తిలకించారు. బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగంలోని అంశాలను నాయకులు ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చేరాల శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, రాజేందర్ జెంజోడ్, మల్లేష్, భాస్కర్, శంకర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ మన్ కీ బాత్ వీక్షించిన ఎమ్మెల్యే

**భైంసా, జులై 26, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మన్ కీ బాత్ 136వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆదివారం వీక్షించారు. భైంసా పట్టణంలోని 131వ బూత్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో కార్గిల్ విజయ దివస్ ప్రాశస్త్యాన్ని, సైనికుల త్యాగాలను స్మరించుకున్నారని తెలిపారు.

అలాగే ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి నిల్వ, భూగర్భ జలాల సంరక్షణపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రావుల పోశెట్టి, పార్టీ మండల అధ్యక్షురాలు సిరం సుష్మా రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పండిత్ రావు పటేల్, నాయకులు యోగేష్, సట్ల సాయి, కిష్టయ్య, భోజరాం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ నస్పూర్ మండల కమిటీ నియామకం

**నస్పూర్, జూలై 26, ప్రభాతవార్త**

అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల నూతన కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు.రాష్ట్ర అధ్యక్షులు కొలే జగన్నాథం ఆదేశాల మేరకు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్,జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా మునిగంటి సత్యనారాయణ చారి,ప్రధాన కార్యదర్శిగా ఎర్రోజు సాయిరాం నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఉప్పుల సత్యనారాయణ, రంగు శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంబోజు శ్రీనివాస్, గౌరవ సలహాదారుగా రామోజీ రాజమోళి, సలహాదారుగా కొత్తూరు రాజమోళి,కార్యవర్గ సభ్యునిగా నౌండ్ల కృష్ణలను నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..అచల భారతీయ విశ్వకర్మ మహాసభ నియమ నిబంధనలకు అనుగుణంగా సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని, విశ్వకర్మ సమాజ హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ ఐక్యంగా పనిచేసి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నరసింహా చారి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తేలుకుంట్ల రాజా చారితో పాటు సంఘ నాయకులు,విశ్వకర్మ సోదరులు పాల్గొన్నారు.